క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుషాయిగూడ: మరమ్మత్తుల కారణంగా కుషాయిగూడ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు శనివారం ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. కుషాయిగూడ, సాయిబాబ టెంపుల్ ఫీడర్ల పరిధిలోని ఏపీఐ ఐసీ కాలనీ, రాధిక టూ ఈసీఐఎల్ చౌరస్తా మెయిన్‌రోడ్డు, పద్మావతి కాలనీ, కుషాయిగూడ ఇండస్ట్రియల్ ఫేస్-2 ప్రాంతాల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు, కమలానగర్ ఫీడర్ పరిధిలోని మార్కేండయానగర్, కమలానగర్, కుషాయిగూడ ఇండస్ట్రియల్ ఫేస్-1 ప్రాంతాల్లో మధ్యాహ్నం 3:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రామంతాపూర్: భరత్‌నగర్‌లోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో ఆదివారం మధుర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ వైద్య శిబిరంలో జనరల్‌మెడిసిన్, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, పీడీయాట్రిక్స్, గైనకాలజీ, ఆప్తమాలజీతో పాటు ఉచిత కంటి ఆపరేషన్లు ఉదయం 9గంట నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించబడునని,పేదలు,మధ్య తరగతి ప్రజలు ఉపయోగించుకుని లబ్ది పొందాలని ట్రస్ట్ చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి కోరారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

మేడిపల్లి: ఏఐఎస్ఎఫ్ తెంగాణ రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు ఈ నెల 26,27,28 తేదీల్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ బోమ్మక్ ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరుగుతాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠ రెడ్డి,పుట్ట లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు విద్యార్థుల సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు.

మెరుగైన సేవలందించేందుకు కృషి



ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంఈవో శశిధర్

మల్కాజిగిరి: విద్యార్థులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని మల్కాజిగిరి మండల విద్యాధికారి శశిధర్ అన్నారు. శనివారం మల్కాజిగిరి, అల్వాల్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ట్యాబ్‌లు అందజేశారు. శశిధర్ మాట్లాడుతూ విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం తీరు తదితర అంశాలను ట్యాబ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి వుంటుందన్నారు. ఈ విధానం ద్వారా ఇంకా మెరుగైన సేవలందించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ మంజూరు



మల్కాజిగిరి: ఓల్డ్ నేరేడ్‌మెట్ కు చెందిన భాగ్యలక్ష్మి చికిత్స కోసం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చొరవతో లక్ష రూపాయల ఎల్‌ఓసీ మంజూరైంది. శనివారం నియోజకవర్గ టీఆర్ఎస్ అధికార ప్రతినిధి జీఎన్వీ సతీష్‌కుమార్ ఆమె కుటుంబసభ్యులకు అందజేశారు. కన్న, పార్థు, సైదులు, సాయిగౌడ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



బోడుప్పల్: బోడుప్పల్ కేశవ్‌నగర్‌కు చెందిన దామరాజు పెద్రాజు శర్మ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు వైద్య ఖర్చుల నిమిత్తం శనివారం మహా భాగ్యనగర బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో రూ.40250 నగదు అందచేశారు. ఈ సందర్భంగా సమితి ప్రధినిధులు రాంప్రసాద్ శర్మ, శ్యామ్‌మోహన్‌శర్మ, అన్నవజ్జుల రాధాకృష్ణశర్మ, ఇంగు నర్సింహమూర్తి రెండు విడతలో ఆర్థిక సహాయం అందచేశారు.

విద్యార్థిని అదృశ్యం

మేడిపల్లి : మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ విద్యార్థిని అదృశ్యమైంది. మేడిపల్లి సాయి అంజన నిలయంలో నివాసముంటున్న దండెం పావని రెడ్డి(18) మహిళా విజ్ఞాన్ కాలేజ్‌లో బీటెక్ చదువుతోంది. ఈ నెల 23న ఉదయం కాలేజీకి వెళ్ళింది. సాయంత్రం తన స్నేహితుల ద్వారా పావని కాలేజీకి వెళ్ళ లేదని సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు పలుప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించక పోవటంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మౌలిక వసతులు కల్పిస్తాం



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. శనివారం నాచారం డివిజన్ పరిధిలోని సీసీ రోడ్డు పనుల కోసం అన్నపూర్ణ కాలనీలో 33 లక్షల వ్యయం, న్యూ అంబేడ్కర్‌నగర్‌లో 20.60 లక్షల వ్యయం తో చేపట్టనున్న పనులకు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమీటి సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌తో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రణాళికా బద్ధంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేయిస్తున్నమని పేరొన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. త్వరలోనే నాచారంలో పెండింగ్‌లో ఉన్న మిగిలిన అనిన పనులు దశల వారీగా పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ లింగారావు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, నాచారం ఇన్‌స్పెక్టర్ నందీశ్వర్‌రెడ్డి, న్యూ అంబేడ్కర్‌నగర్, అన్నపూర్ణ కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాలన మరింత సులభతరం..



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రభుదాస్..

కుషాయిగూడ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్డు కార్యాలయాల వ్యవస్థతో పాలన మరింత సులభతరమయిందని కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని నర్సింహనగర్ కాలనీలో పర్యటించి మంచినీటి, డ్రైనేజీ సమస్యలను ఆయన పరిశీలించారు. కాలనీ సంక్షేమసంఘం ప్రతినిధులతో మాట్లాడారు. నూతనంగా ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాల పనితీరుపై అవగాహన కల్పించారు. అధికారులంతా కార్యాలయంలో అందుబాటులో ఉంటారని, ఎలాంటి సమస్యలైనా నేరుగా అక్కడికి వెళ్లి పరిష్కారించుకోవచ్చన్నారు. కాలనీలో సమస్యలకు దశలవారిగా పరిష్కారం చూపుతానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రాకేష్, విజయ్, సాయి, శ్రీనివాస్, రాజు, సాయికుమార్, నిసార్ అహ్మద్‌గోరి తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు వాటాదారులుగా సేవలు అందిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ వైస్ చైర్మన్ వైఎస్సార్‌మూర్తి

గౌతంనగర్: ఖాతాదారులకు వాటాదారులుగా భావించి మెరుగైన సేవలు అదిస్తామని ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ వైస్ చైర్మన్ వైఎస్సార్ మూర్తి అన్నారు. శనివారం హనుమాన్‌పేట్‌లోని ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ ఖాతాదారుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ మూర్తితో పాటు బ్రాంచ్ మేనేజర్ కేవీ. సుబ్బాయ్య, ఖాతాదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ బ్యాంక్‌లో రూ. 1863 కోట్ల డిపాజిట్లు, రూ. 1606 కోట్ల రుణాలు, రూ. 86 కోట్ల లాభాలు, రూ. 3470 కోట్ల బిజినెస్ టర్నోవర్‌లో పురోభివృద్ధిలో ఉందన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ సోమలింగంగౌడ్, మేనేజర్ ఎస్.ఎమ్ ఫీరాన్ పాల్గొన్నారు.

ద మాస్టర్ మైండ్ పాఠశాలలో హరితహారం



కాప్రా: కమలానగర్‌లోని ద మాస్టర్ మైండ్ పాఠశాలలో శనివారం హరితహారం కార్యక్రమంలో భాగంగా పాఠశాల డైరెక్టర్ చంద్రమౌళి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు హరితహారంలో భాగస్వామ్యులు కావాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ భువనేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బొడ్రాయి పండుగ షురూ

ఉప్పల్: చిలుకానగర్ బొడ్రాయి 3 వ వార్షికోత్స వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పూజల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బొడ్రాయి కమిటీ కన్వీనర్ జల్లి మోహన్, కో- కన్వీనర్ ముక్కాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కార్పొరేటర్

అల్వాల్: పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం అల్వాల్‌లోని చినరాయుడి చెరువు వద్ద టీసీఎస్ మైత్రీ సిబ్బంది, కాలనీ వాసులతో కలిసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలన్నారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

మౌలాలి: మౌలాలి డివిజన్ ఆఫీసర్స్ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శనివారం కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఉప్పల్ మిని శిల్పారామంలో శనివారం నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో బాగంగా బండి పేరిణి కుమార్ గురువు డాక్టర్ నటరాజ రామకృష్ణ జ్ఞాపకార్థం ఆంధ్రనాట్య నృత్యర్పణం ఏర్పాటు చేసారు. డా.దేవుళ్లపల్లి ఉమా ముఖ్య అతిథులుగా హాజరై కళాకారులను అభినందించారు. – ఉప్పల్



మల్కాజిగిరి అభివృద్ధికి కృషి

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నామని శాసనసభ్యులు మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శనివారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని కావేరీ కాలనీ, వెంకుసా ఎస్టేట్ కొకూర్ తదితర ప్రాంతాలలో ఆయన స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్‌తో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా ఆయా కాలనీలలో డ్రైనేజీ పొంగి పొర్లి మురుగునీరు రోడ్లపై ఏరులై పారుతుందని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అలాగే కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణంతోపాటు పార్కు అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు, పెండింగ్‌లోఉన్న రోడ్లు వేయాలని కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



కాలనీలో డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

ఉప్పల్‌లో ఏదీ అభివృద్ధి?

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

ఉప్పల్: ఉప్పల్‌లో అభివృద్ధి గత కొన్నేళ్లుగా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని ఏ ముఖం పెట్టుకుని ఉప్పల్‌లో అడుగు పెడ్తావంటూ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఎద్దేవ చేసారు. ఈ నెల 26న మంత్రి కేటీఆర్ ఉప్పల్ స్కైవాక్ వంతెన, మిని శిల్పారామంలో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవానికి వస్తున్న సందర్భంగా ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో ఈ వ్యాఖ్యలు చేసారు. ఉప్పల్ నియోజకవర్గంలో చెరువుల దుస్థితిని చూస్తే అర్థమవుతుందన్నారు. మిషన్ కాకతీయ, నల్ల చెరువు సుందరీకరణ, దాదాపు చెరువులన్నీ కబ్జాల కోరల్లో చిక్కుకున్నాయని ఆరోపించారు. ఉప్పల్ బస్సు టర్మినల్ అభివృద్ధి చేయలేదని ఎలివేటెడ్ కారిడార్ పనులను అటకెక్కించారని దుయ్యబట్టారు. వీటన్నింటికీ సమాధానం చెప్పిన తరువాతే ఉప్పల్‌లో అడుగు పెట్టాలని లేని పక్షంలో కేటీఆర్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు.

దరఖాస్తుల విచారణ ప్రారంభం

ఉప్పల్: జీవో 59 లో భాగంగా ఉప్పల్ మండల పరిధిలోని ప్రభుత్వ స్థలాల్లో 2020 జూన్ కన్నా ముందు నిర్మించుకున్న అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తుల విచారణ ప్రారంభమైందని ఉప్పల్ తహసీల్దార్ గౌతంకుమార్ తెలిపారు. మొత్త కలిపి-347 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. వారం రోజుల పాటు రెవిన్యూ సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి విచారణ జరుపుతాయని తెలిపారు.

నాలా నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్



మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ కృపానంద్ అపార్ట్‌మెంట్స్ వద్ద వర్షంనీరు వెళ్లడానికి రూ.40 లక్షలతో నిర్మిస్తున్న స్ట్రామ్‌వాటర్ నాలా నిర్మాణాన్ని కార్పొరేటర్ శ్రవణ్ శనివారం పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ నాలా నిర్మాణం పూర్తయితే కాలనీవాసుల ఇబ్బందులు తొలుగుతాయన్నారు.ఈ కార్యక్రమంలో జగదీష్,శేఖర్, అశ్విన్‌కుమార్, అరుణ,మున్ని, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి చేద్దాం

అల్వాల్: బీజేపీ గెలుపునకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్‌రావు అన్నారు. శనివారం నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని బూత్‌నంబర్ 9.10లో ఘర్ ఘర్ మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో జరిగింది. మోదీ సంవత్సరాలలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్



కుషాయిగూడ ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి

కాప్రా: పేదవారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం జమ్మిగడ్డలోని కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి ఓపీ, రిజిస్టర్, ఫార్మసీ స్టోర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా సేవలందిస్తున్నాయన్నారు. అనంతరం విధుల పెట్ల నిర్లక్ష్యం వహించినందుకు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, ఫార్మసిస్టలకు మెమో జారీ చేసి వారి విధుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో నారాయణరావు, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమాదేవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్న చెరువును కాపాడండి



చిన్న చెరువు ప్రాంగణంలో పర్యటిస్తున్న రాగిడి తదితరులు

రామంతాపూర్ : చిన్న చెరువును శనివారం నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చెరువు శిఖం భూములు కబ్జాలకు గురవుతూ నిర్మాణాలు జరుగుతున్నా నియోజవర్గ, స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. సుందరీకరణ పేరుతో లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా ఇంకా చెరువు చెత్తకు నిలయంగా మారి దుర్వాసన వెదజల్లుతోందని ఆయన పేర్కొన్నారు. వాకింగ్ ట్రాక్‌లో జులాయిలు మద్యపానం, గంజాయి సేవిస్తున్నా పట్టించుకునే వారే లేరన్నారు. ఇప్పటికైనా చెరువు సుందరీకరణ పనులు చేపట్టి ఫెన్సింగ్ వేసి చెరువులోకి మురుగు చెత్త చేరకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే జీహెచ్ఎంసీ కార్యాలయంతో పాటు ప్రజా ప్రతినిధుల ఇండ్ల వద్ద ధర్నాకు దిగుతామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు వినోద్ ముదిరాజ్, ఆపిల్ శ్రీను, ఆదినారాయణ, పూస సత్తయ్య, గణేష్ నాయక్, సందీప్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా సూర్ణం రాజేష్

మల్లాపూర్: తెలంగాణ టీడీపీ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శిగా మల్లాపూర్ బ్యాంక్ కాలనీకి చెందిన సీనియర్ టీడీపీ నేత సూర్ణం రాజేష్ నియామితులయ్యారు. ఈ మేరకు శనివారం తెలంగాణ టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం సూర్ణం రాజేష్ మాట్లాడుతూ.. బీసీ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ, పార్టీ బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు.

పై కప్పు శిథిలం..దుర్గంధ భరితం..

కుషాయిగూడ మార్కెట్‌లో అపరిశుభ్రత



అపరిశుభ్రంగా మారిన కుషాయిగూడ మార్కెట్



శిథిలమైన మార్కెట్ పైకప్పు రేకులు

కుషాయిగూడ: నిత్యం వేల మంది వినియోగదారులతో కిటకిటలాడే కుషాయిగూడ కూరగాయాల మార్కెట్ పై కప్పు శిథిలమైంది. దీంతో మార్కెట్‌లో అపరిశుభ్రత నెలకొని దుర్గంధభరితంగా మారింది. మొన్నటి వరకు వేసవి ఎండలతో ఇబ్బందులు పడ్డ వ్యాపారులు గత రెండు మూడు రోజులుగా సాధారణంగా కురుస్తున్న వర్షాలకే ఉక్కిరిబిక్కిరి అవుతుంటే రానున్న రోజుల్లో బారీ వర్షాలు కురిస్తే మా పరిస్థితి ఏమిటని వ్యాపారులు వాపోతున్నారు. మార్కెట్ పైకప్పు రేకులు శిథిలం కావడంతో చినుకు పడిదంటే చాలు మార్కెట్‌లోకి వర్షం నీరు చేరి వ్యాపారాలు చేసుకోలేకపోతున్నారమన్నారు. పైగా పావురాల కారణంగా మార్కెట్ పూర్తిగా దుర్గంధభరితంగా మారిందని తెలిపారు. వర్షం పడ్డ సమయంలో వచ్చే దుర్వాసనతో మార్కెట్‌లో క్షణం కూడా ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అధికారులు స్పందించి నిత్యం రద్దీగా ఉండే కుషాయిగూడ కూరగాయాల మార్కెట్‌లో తక్షణ మరమ్మత్తులు చేపట్టాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

పనులను పూర్తి చేయడంలో సర్కార్ వైఫల్యం



ఎస్ఎన్‌డీపీ పనుల జాప్యానికి వ్యతిరేకంగా దీక్ష చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేడిపల్లి: 2020 అక్టోబర్‌లో వచ్చిన వరదల వల్ల తలెత్తిన ఇబ్బందులు మరోసారి తలెత్తకుండా రూ.110 కోట్లతో నిర్మించ తలపెట్టిన ఎస్ఎన్‌డీపీ పనులను పూర్తి చేయడంలో రాష్ట్ర సర్కార్ వైఫల్యం చెందిందని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ విమర్శించారు. బోడుప్పల్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ముంపు ప్రాంతాల సమస్యల పరిష్కారానికి చేపట్టిన ఎస్ఎన్‌డీపి పనుల్లో నిర్లక్ష్యం, జాప్యానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ బోడుప్పల్ కార్పొరేషన్ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి, పీర్జాదిగూడ కార్పొరేషన్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో ఉప్పల్ డిపో వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమానికి తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ అట్టహాసంగా ప్రారంభించిన పనులు రెండేళ్ళు పూర్తయినా మూడోవంతు పనులు కూడా పూర్తి చేయక పోవడం సిగ్గు చేటన్నారు. ఈ దీక్షలో జంట కార్పొరేషన్ల కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. మేడ్చల్ నియోజకవర్గం కో-ఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సరిత వెంకటేష్,పత్తి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ ఎల్ఎఫ్ఎస్‌లో విద్యార్థుల కేబినెట్ ప్రమాణోత్సవం



ఉప్పల్: విద్యార్థులు చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలని రాచకొండ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ వి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్లో విద్యార్థుల కేబినెట్ ప్రమాణ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. పాఠశాల విద్యార్థి, లిటరరీ, కల్చరల్, ఫైన్ ఆర్ట్స్, స్పోర్ట్స్ అండ్‌గేమ్స్ నాయకులుగా తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన కవాతు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉప్పల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి, కరస్పాండెంట్ రెవరెండ్ బ్రదర్ అరుణ్ ప్రకాష్, ఫైనాన్షియల్ అడ్మినిస్ట్రేటర్ రెవరెండ్ బ్రదర్ ఎమ్ఏ జార్జ్, ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ జోసెఫ్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ ప్రేమ్ కుమార్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ధర్మకర్తల మండల కమిటీ నియామకాన్ని రద్దు చేయాలి



వినతిపత్రం అందచేస్తున్న కార్పొరేటర్ శిరీషారెడ్డి

కాప్రా: హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా నియమించిన ఏఎస్‌రావునగర్ డివిజన్ టీఎస్ఐఐసీ కాలనీలోని శ్రీసహస్ర లింగేశ్వరి స్వామి దేవస్థానం ధర్మకర్తల మండల కమిటీ నియామకాన్ని నిలిపివేయాలని ఏఎస్‌రావునగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషాసోమశేఖర్‌రెడ్డి శనివారం దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం దేవాలయ వార్షిక ఆదాయం రూ.25 లక్షల నుండి కోటి మధ్య ఉన్నందున దేవాలయానికి ధార్మిక పరిషత్ మాత్రమే ధర్మకర్తల మండలిని నియమించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీనికి విరుద్ధంగా ధర్మకర్తల మండలిని నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా ఉన్నాయన్నారు.